సాక్షి
మహబూబాబాద్

శనివారం | 21 | డిసెంబర్ | 2024



నిర్వహణాధికారులు ఎక్కడ?
మేడారంలో కార్యనిర్వహణాధికారి కార్యాలయం లేకపోవడంతో అధికారులు చుట్టపు చూపుగా వస్తున్నారని ఆదివాసీ పూజారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. - 8లో▸



టీజీబీగా ఏపీజీవీబీ బ్రాంచీలు
రాష్ట్రంలోని ఏపీజీవీబీలు ఇక నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకులు (టీజీబీ)గా సేవలు అందించనున్నట్లు చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. - 8లో▸



వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

కంటి ఆస్పత్రుల తనిఖీ



నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మి, సూర్య కంటి ఆస్పత్రులను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రమీలరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ఆస్పత్రి రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, ఆస్పత్రిలో శుభ్రత పాటించాలని సూచించారు. డాక్టర్లు, సిబ్బంది సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఇటీవల ఆస్పత్రుల్లో జరిగిన కంటి ఆపరేషన్ల అనంతరం కంటిచూపు మందగించిందని గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదులు అందగా.. ఈ మేరకు వైద్యాధికారులు ఆస్పత్రుల్లో తనిఖీలు చేపట్టి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్ చేసిన నలుగురు రోగుల వివరాలు, కేస్‌షీట్లను అందజేయాలని ఆస్పత్రి నిర్వాహకులకు సూచించారు. తనిఖీలో సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్ గీత, డాక్టర్ సుధీర్‌కుమార్, సీహెచ్‌ఓ పల్లి గోవర్ధన్ పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతిని అవలంబించాలి

నర్సింహులపేట: రైతులు వరిసాగులో డ్రమ్ సీడర్, విత్తనాలను వెదజల్లే పద్ధతిని అవలంబించడం ద్వారా ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని డీఏఓ విజయనిర్మల అన్నారు. మండలంలోని వంతడపల, నర్సింహులపేట గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఆమె వరి నారుమడులను పరిశీలించి మాట్లాడారు. వెదజల్లే, డ్రమ్‌సీడర్ పద్ధతులు ద్వారా వరి సాగు చేస్తే విత్తనంతో పాటు కూలీల ఖర్చు తగ్గుతుందన్నారు. గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ వినయ్‌కుమార్, వ్యవసాయ సాంకేతిక అధికారి మోహన్, ఏఈఓలు జక్కుల బాబు, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు

నెల్లికుదురు: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.శ్రీనివాసరావు కోరారు. మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో శుక్రవారం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందుతున్న వివిధ పథకాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంపీడీఓ బాలరాజు, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మాదిరి ప్రశాంత్, నాయకులు శ్రీనివాస్, రామచంద్రు, సతీష్, స్వామి, సాంబయ్య, వెంకటయ్య, రాములు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల వంటావార్పు



మహబూబాబాద్: సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె శుక్రవారం కొనసాగింది. ఈమేరకు వంటావార్పు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా నాయకులు వీరన్న, ఉపేందర్, ప్రభావతి, కల్పన మాట్లాడుతూ.. ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రధానంగా రెగ్యులరైజ్ చేయాలని, తక్షణమే పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు . నిరవధిక సమ్మెకు పలు సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వీరస్వామి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నిర్మూలనకు కృషి చేయాలి

నెహ్రూసెంటర్: జిల్లాలో హెచ్ఐవీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తూ అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ మురళీధర్ అన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో కమ్యూనిటీ అడ్వైజరీ బోర్డు సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. హైరిస్క్ గ్రూపులు, డ్రగ్స్ అబ్యూసర్లు, ఫీమేల్ సెక్స్‌వర్కర్లు, ట్రాన్స్‌జెండర్లు హెచ్ఐవీ నియంత్రణలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. మానుకోటను హెచ్ఐవీ రహిత జిల్లాగా మార్చేందుకు అందరం కలిసికట్టుగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌కుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జ్యోతి, క్లినికల్ సర్వీస్ ఆఫీసర్ సారయ్య, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ప్రోగ్రాం మేనేజర్ శాంతరాజు, లింక్ వర్కర్ మేనేజర్ ముస్తాక్, ఐసీటీసీ కౌన్సిలర్ రమేశ్ ఉన్నారు.

గుప్తనిధుల తవ్వకాలు!

దేవాలయాలు, పురాతన కోటలే టార్గెట్..

- తవ్వకాలతో పురావస్తు సంపదకు ముప్పు
- కోటగోడలు, శిలాశాసనాలు ధ్వంసం

సాక్షి, మహబూబాబాద్: జిల్లాలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపుతూ విలువైన సొత్తును దోచుకెళ్తున్నారు. ముఖ్యంగా కాకతీయులకాలం నాటి దేవాలయాలు, కోటల వద్ద తవ్వకాలు చేపట్టి బంగారం, ఇతర విలువైన విగ్రహాలు, శిల్ప సంపదను ఎత్తుకెళ్లే గ్యాంగ్‌లు జిల్లాలో ఎక్కువ అవుతున్నాయి. ఈ తవ్వకాలతో ఆలయాలు, గడీలు, కోటలు బీటలుబారుతున్నాయి. ఈ క్రమంలో చరిత్ర ఆనవాళ్లు ఒక్కొక్కటిగా కనుమరుగవుతున్నాయి. ఇంత జరిగినా దేవాదాయ ధర్మాదాయశాఖతో పాటు పురావస్తుశాఖ, జిల్లా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.

పూర్వీకులు దాచిన ధనం..

ఈ ప్రాంతాన్ని పాలించిన శాతవాహనులు, కాకతీయులు, వారి సామంతరాజులు జిల్లా వ్యాప్తంగా ప్రతీ గ్రామంలో శివాలయాలు, వైష్ణవాలయాలను నిర్మించారు. కాగా జిల్లాలో దేవాదాయశాఖ రికార్డుల ప్రకారం 257కుపైగా దేవాలయాలు ఉండగా.. రికార్డుల్లో లేనివి మరో 100మేరకు ఆలయాలు ఉంటాయని అంచనా. అదేవిధంగా నవాబుల కాలం వరకు అనేక కోటలు, దుర్గాలు, బురుజులు కట్టించారు. ఇలా జిల్లాలోని బయ్యారం చెరువుపై కాకతీయుల శిలాశాసనం, ఇనుగుర్తి, కందికొండ, గార్ల, వేలుబెల్లి, కొత్తగూడ, మాటేడు, నర్సింహులపేట, తానంచర్ల, కురవి, గుర్తూరు, పెద్దముప్పారం, చిన్నగూడూరు, నేరడ మొదలైన ప్రాంతాల్లో రాజులు నిర్మించిన దేవాలయాలు, కోటలు, పూర్వీకులు నివసించిన గ్రామాల ఆనవాళ్లు ఉన్నాయి. కాగా దేవతామూర్తుల విగ్రహాలు, నందీశ్వరుడు, గర్భగుడి, ధ్వజస్తంభం మొదలైన చోట్ల బంగారం, వెండి ఇతర ధనాన్ని వేసి నిర్మించడం ఆనాటి ఆచారంగా చెబుతారు. అదేవిధంగా కోటల్లో రాజులు, అప్పుడు నివసించిన ప్రజలు ధరించిన ఆభరణాలు, దాచిన ధనం కూడా భూగర్భంలో కలిసిపోయి పలు తవ్వకాల్లో బయట పడిన సంఘటనలు ఉన్నాయి.

దేవాలయాలు, పురావస్తు స్థలాలపై కన్ను

ఈ ప్రాంతంలో పూర్వీకులు దాచిన ధనాన్ని వెలికితీసే ప్రయత్నాలు ఎప్పుడూ జరుగుతూనే ఉన్నాయి. ప్రధానంగా పురాతన దేవాలయాలు, కోటల మధ్యలో గడ్డపారతో తవ్విన గుర్తులు, అక్కడ ధనం దొరికిన ఆనవాళ్లు కనిపిస్తూనే ఉంటాయి. తవ్విన గుంతల్లో బూడిద, ఊక, కుండలు పగులగొట్టిన పెంకులు కనిపిస్తున్నాయి. అలాగే అక్కడ జంతు బలి, నిమ్మకాయలు కోయడం, కొబ్బరి కాయలు కొట్టిన సందర్భాలు ఉన్నాయి. కాగా ఇటీవల గడ్డపారలు, పారలు, ఇనుప వస్తువులతో కాకుండా ఏకంగా జేసీబీలు, ఇతర మిషన్లు వినియోగించి తవ్వకాలు చేపడుతున్నారు. ఇటీవల బయ్యారం పెద్ద చెరువు కట్టపై ఉన్న కాకతీయుల వంశవృక్షాన్ని తెలిపే శాసనం సమీపంలో పెద్ద గుంత తవ్వారు. ఈ విషయం తెలుసుకున్న నీటిపారుదలశాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా కొత్తగూడ అటవీ ప్రాంతంలో పురాతన కట్టడాల సమీపంలో తవ్వకాలు జరిగాయి. ఇది మరువకముందే తొర్రూరు మండలం మాటేడు గ్రామంలోని పురాతన శివాలయంలో ఉన్న నంది విగ్రహం కింది భాగం తవ్వి గుప్తనిధిని అపహరించుకెళ్లిన ఆనవాళ్లు కనిపించాయి.

పట్టించుకోని అధికారులు..

జిల్లాలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుగుతున్నా.. కట్టడి చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఏకంగా జేసీబీలు, ఇతర మిషన్లతో తవ్వకాలు చేస్తున్నా.. వాటిని పరిరక్షించాల్సిన పురావస్తు శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖ, జిల్లా యంత్రాంగం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి గుప్తనిధుల తవ్వకాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



బయ్యారం పెద్ద చెరువుపై గుప్త నిధుల కోసం తవ్వకాలు(ఫైల్) (ఇన్‌సెట్‌లో) తొర్రూరు మండలం మాటేడు గ్రామంలోని పురాతన శివాలయంలో గుప్త నిధుల కోసం తవ్విన ప్రదేశం(ఫైల్)

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



జిల్లాలో గుప్తనిధుల పేరిట దేవాలయాలను ధ్వంసం చేస్తున్న సంఘటనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారి ఆదేశాల మేరకు పోలీసులకు ఫిర్యాదులు చేయడం, నిందితులను కనిపెట్టి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. చారిత్రక సంపద, దేవాలయాల పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి.

– రెంటాల సమత, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్, మహబూబాబాద్



కేసముద్రం గ్రామం వ్యూ

మున్సిపాలిటీగా కేసముద్రం

- అసెంబ్లీలో ప్రకటించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- నెరవేరనున్న చిరకాలవాంఛ

కేసముద్రం: జిల్లాలో ఇప్పటికే మహబూబాబాద్, డోర్నకల్, మరిపెడ, తొర్రూరు మున్సిపాలిటీలు ఉండగా.. ప్రభుత్వం నూతనంగా కేసముద్రం మున్సిపాలిటీ ఏర్పాటు చేయనుంది. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అసెంబ్లీలో ప్రకటించారు. దీంతో అన్ని అర్హతలు కలిగిన కేసముద్రం మున్సిపాలిటీగా ఏర్పాటుకానుండడంతో ఇక్కడి ప్రజల చిరకాలవాంఛ నెరవేరనుంది.

విలీన గ్రామాల వివరాలు		
గ్రామం	వార్డులు	జనాభా
కేసముద్రంవిలేజ్	14	5,862
కేసముద్రంస్టేషన్	14	8,072
సబ్‌స్టేషన్‌తండాజీపీ	08	1,007
ధన్నసరి	10	2,214
అమీనాపురం	10	2,283

గ్రామాల విలీనం..

కేసముద్రంను మున్సిపాలిటీలో కేసముద్రంవిలేజ్, కేసముద్రంస్టేషన్, ధన్నసరి, అమీనాపురం, సబ్‌స్టేషన్‌తండా గ్రామాలను విలీనం చేయనున్నారు. ఈమేరకు ఆయా గ్రామాల్లో అధికారులు గ్రామసభలను నిర్వహించారు. ఆయా గ్రామాలు కేసముద్రం మున్సిపాలిటీ కోసం ఏకగ్రీవంగా తీర్మానించాయి. ఈ నివేదికను అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి అందించారు. ఈ క్రమంలో అసెంబ్లీ సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు రాష్ట్రంలో కొత్తగా 12 మున్సిపాలిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో భాగంగా కేసముద్రంను మున్సిపాలిటీగా ప్రతిపాదిస్తూ అసెంబ్లీలో ప్రకటన చేశారు. దీంతో ఏర్పాటు కానున్న మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 19,438 మంది జనాభా ఉన్నట్లు అధికారులు తెలిపారు. 1980 వరకు కేసముద్రం ఉమ్మడి గ్రామంగా ఉండేది. ఆ తర్వాత 1981లో కేసముద్రంస్టేషన్, కేసముద్రంవిలేజ్ పంచాయతీలుగా ఏర్పడ్డాయి. దాదాపు 43 సంవత్సరాల తర్వాత, మున్సిపాలిటీ ఏర్పాటుతో ఆ రెండు గ్రామాలు మళ్లీ ఒకటికానున్నాయి.

కనుమరుగుకానున్న ఎంపీటీసీలు, సర్పంచ్‌లు..

కేసముద్రం మున్సిపాలిటీ ఏర్పాటుతో 5 గ్రామాలకు సర్పంచ్‌లతోపాటు, 56 వార్డుసభ్యులు, 6 ఎంపీటీసీ స్థానాలు కనుమరుగు కానున్నాయి. వీటి స్థానంలో కొత్తగా ఆయా గ్రామాల్లో మున్సిపల్ కౌన్సిలర్లు ఎన్నిక కానున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పారదర్శకత పాటించాలి

- అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

నెల్లికుదురు: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వేలో పారదర్శకత పాటించాలని అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించి తగిన సూచనలు, సలహాలు చేశారు. అనంతరం ఎస్సీ బాలుర వసతి గృహం, కేజీబీవీ పాఠశాలను సందర్శించి వంటగదులు, పరిసరాలను పరిశీలించారు. కేజీబీవీలో పని చేస్తున్న టీచర్లు సమ్మెలో పాల్గొంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి నాణ్యమైన భోజనం అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. తహసీల్దార్ కోడిచింతల రాజు, ఎంపీడీఓ బాలరాజు పాల్గొన్నారు.



ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

పోడు రైతులకు పంట రుణాలు ఇవ్వాలి

- గిరిజన దర్బార్‌లో వినతుల వెల్లువ
- ప్రతీ సమస్యకు సమాధానం ఇచ్చిన ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా

కొత్తగూడ: ఏజెన్సీ మండలాల్లో పోడు హక్కు పట్టాలు ఉన్న రైతులకు పంట రుణాలు అందించాలని తుడుందెబ్బ నాయకులు మండలకేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం జరిగిన గిరిజన దర్బార్(గ్రీవెన్స్)లో ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రాకు వినతిపత్రం అందజేశారు. కొత్తగూడ, గంగారం, గూడూరు మండలాల్లో ఎక్కువ మంది రైతులు పోడు వ్యవసాయంపై ఆధారపడుతున్నారన్నారు. వారికి హక్కు పత్రాలు ఉన్నా బ్యాంకులు పంట రుణాలు ఇవ్వకపోవడంతో వడ్డీ వ్యాపారులపై ఆధారపడి దోపిడీకి గురవుతున్నారని వివరించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పీఓ హామీ ఇచ్చారు. గుండ్రపల్లి ప్రాథమిక పాఠశాలను పునఃప్రారంభించాలని గ్రామస్తులు వినతిపత్రం అందించారు. ఈ సమస్య కలెక్టర్ ద్వారా పరిష్కారం అవుతుందని అందుకు మహబూబాబాద్ గ్రీవెన్స్‌కు వెళ్లాలని సూచిస్తూ, వినతిని ఐటీడీఏ ద్వారా సంబంధిత అధికారులకు పంపిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో రోడ్ల పనులుపూర్తి చేయాలని ప్రజలు వినతి పత్రాలు అందించారు. పోడు భూముల్లో వ్యవసాయానికి ఫారెస్ట్ అధికారుల అడ్డంకులను ఆపాలని న్యూడెమోక్రసీ నాయకులు వినతి పత్రం అందజేశారు. గిరివికాస్ బోర్లు మంజూరు చేయాలని పలు గ్రామాల రైతులు వినతి పత్రాలు అందజేశారు. ఆదివాసీ ఉపాధ్యాయుల సర్వీస్ రెగ్యులరైజ్ చేయాలని ఉపాధ్యాయ సంఘం నాయకులు సిద్దబోయిన బిక్షం వినతిపత్రం అందజేశారు. పోడు పట్టాలు రాలేదని, పెన్షన్లు రావడం లేదని, గ్రామాల్లో అంతర్గత రోడ్లు మంజూరు చేయాలని మొత్తం 48 వినతులు అందాయి. కార్యక్రమంలో కొత్తగూడ, గంగారం, గూడూరు, బయ్యారం, గార్ల మండలాల అధికారులు, ఐటీడీఏ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న పీఓ చిత్రామిశ్రా

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

కేసముద్రం: నూతన డైట్ మెనూ, విద్య, వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ, కల్వల మోడల్‌స్కూల్, బాలికల వసతి గృహం, కేసముద్రంస్టేషన్ జెడ్పీహైస్కూల్, పెనుగొండ, బోడమంచ్యాతండాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసముద్రం పీహెచ్‌సీలో మందుల స్టాక్, రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ పరిధిలో ప్రతీరోజు షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు, శిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలన్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, వైద్య సిబ్బంది సకాలంలో ఆస్పత్రికి రావాలని ఆదేశించారు. అదేవిధంగా మోడల్‌స్కూల్, వసతిగృహం, కేసముద్రంస్టేషన్ జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. విద్యార్థులు చదువుపై ఆసక్తి చూపుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన డైట్ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని, విద్య, శానిటేషన్, వైద్యం విషయంలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ దామోదర్, ఎంపీడీఓ క్రాంతి, మార్కెట్ చైర్మన్ సంజీవరెడ్డి ఉన్నారు.

పోటాపోటీగా సీఎం కప్ క్రీడలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడాపోటీలు శుక్రవారం రెండోరోజు కొనసాగాయి. క్రీడాకారులు ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, తైక్వాండో క్రీడల్లో తలపడ్డారు. కబడ్డీ పోటీల్లో కొత్తగూడ బాలుర జట్టు మొదటిస్థానం కైవసం చేసుకోగా తొర్రూరు జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. అలాగే కొత్తగూడ బాలికల జట్టు మొదటిస్థానం, తొర్రూరు బాలికల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. వాలీబాల్ పోటీల్లో కొత్తగూడ బాలుర జట్టు ప్రథమ స్థానంలో నిలువగా.. మహబూబాబాద్ మున్సిపాలిటీ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. అలాగే తొర్రూరు మున్సిపాలిటీ బాలికల జట్టు వాలీబాల్ పోటీల్లో మొదటి స్థానంలో నిలువగా కొత్తగూడ బాలికల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. హ్యాండ్‌బాల్ పోటీల్లో కొత్తగూడ బాలుర జట్టు మొదటి స్థానం, మహబూబాబాద్ జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. అలాగే కొత్తగూడ బాలికల జట్టు మొదటిస్థానం, మహబూబాబాద్ జట్టు ద్వితీయస్థానంలో నిలిచినట్లు జిల్లా క్రీడల అధికారి జ్యోతి తెలిపారు. కార్యక్రమంలో క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



ఖోఖో ఆడుతున్న బాలికలు

బాల్యానికి ‘బంధం’

పెరుగుతున్న బాల్య వివాహాలు

- 2023లో 106.. ఈ ఏడాది ఏకంగా 140
- అధికారులు ఆపినవి ఇవే అయితే అనధికారికంగా ఎన్నో
- ఏటికేడు పెరుగుతుండడంతో అధికారుల్లో ఆందోళన
- తల్లిదండ్రుల్లో మార్పుతోనే అరికట్టే అవకాశం

బాల్యం వివాహ బంధంలో బందీ అవుతోంది.. మూడుముళ్లతో ముక్కుపచ్చలారని బాలికల జీవితాన్ని ముడిపెడుతున్నారు. ఈ పరిస్థితిని నిరోధించడానికి చట్టాలు ఉన్నా.. అవగాహన రాహిత్యంతో కొందరు.. ఆర్థిక సమస్యలతో మరికొందరు బాల్య వివాహాలు చేస్తూ వారి బంగారు భవిష్యత్‌ను బుగ్గి చేస్తున్నారు.



ఈనెల 5న వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని ఓ గ్రామంలో 16 ఏళ్ల బాలికకు వరుసకు మేనబావ అయిన 28 ఏళ్ల యువకుడితో వివాహం చేస్తున్నట్లు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం వచ్చింది. జిల్లా బాలల సంరక్షణ విభాగాధికారులు బాలికను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరిచారు. తర్వాత ఆమె తల్లిదండ్రులకు బాల్యవివాహంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండే వరకు పెళ్లి చేయమని లిఖితపూర్వకంగా హామీ తీసుకుని బాలికను అప్పగించారు.

నవంబర్ 19న వరంగల్ జిల్లా దుగ్గొండి మండల పరిధిలోని ఓ గ్రామంలో 16 ఏళ్ల అమ్మాయి, 25 ఏళ్ల అబ్బాయికి వివాహం అవుతున్నట్లు ఫోన్ రావడంతో జిల్లా బాలల సంరక్షణ అధికారులు వెళ్లి పెళ్లి ఆపారు. తర్వాత అమ్మాయిని సీడబ్ల్యూసీ ఎదుట హాజరుపరిచి నర్సంపేటలోని ఆశ్రమ పాఠశాలకు తరలించారు. అక్కడ రెండు రోజులున్న తర్వాత అమ్మాయిని తల్లిదండ్రులు తీసుకెళ్లారు.

ఈనెల 14న ములుగు జిల్లా ఏటూరునాగారంలో ఓ 16 ఏళ్ల బాలికకు 27 ఏళ్ల యువకుడితో వివాహం చేస్తున్నారని 1098 నంబర్‌కు రెండురోజుల ముందే సమాచారం వచ్చింది. జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు వెళ్లి అమ్మాయి కుటుంబసభ్యులతో మాట్లాడారు. అనంతరం సీడబ్ల్యూసీ ఎదుట హాజరుపరిచి అమ్మాయి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. 18 ఏళ్లు నిండే వరకు పెళ్లి చేయమని లిఖితపూర్వక హామీ ఇవ్వడంతో బాలికను వారితో పంపించారు.

సాక్షి, వరంగల్ : ఆధునిక సాంకేతికత ఎంతో పెరిగింది. సమాజంలో పెనుమార్పులు వచ్చాయి. అయినా బాల్యవివాహాలు ఆగడం లేదు. ఆడపిల్లలు చదువులో రాణిస్తూ అన్నిరంగాల్లో దూసుకుపోయి సత్తా చాటుతున్నా ఇంకా పలుచోట్ల బలవంతపు వివాహాలు చేస్తూ బలి చేస్తూనే ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో ఇప్పటికీ తరచూ బాల్యవివాహాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఈ ఆరు జిల్లాల్లో 2023 సంవత్సరం 106 బాల్యవివాహాలను అధికారులు అడ్డుకోగా.. ఈ ఏడాది ఏకంగా 140 వరకు నిరోధించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంకా వెలుగులోకి రానివి అనేకం ఉన్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం.. 18 ఏళ్లలోపు బాలికలు 26.8 శాతం మంది, 21 ఏళ్లలోపు బాలురు 20.3 శాతం మంది బాల్యవివాహాల బారిన పడుతున్నట్లు పేర్కొనడం ఆందోళన కలిగిస్తోంది.

ఆ కుటుంబాల్లోనే ఎక్కువ..

తల్లిదండ్రుల్లో ఒకరు చనిపోయినప్పుడు బాలికలను భారంగా భావిస్తున్నారు. 14 నుంచి 18 ఏళ్లలోపు వారిని పెళ్లి పీటలెక్కిస్తున్నారు. తాజాగా నమోదైన కేసుల్లో అమ్మాయిలు బడికెళ్లి చదువుకుంటుండగానే మధ్యలో ఆపి మెడలో పసుపుతాడు వేసేందుకు పట్టుబడుతున్నారు. తండ్రి చనిపోయాడని, పేదరికం పట్టి పీడిస్తోందని, అందుకే అమ్మాయిల భారం దించేసుకోవాలని బాల్యవివాహాలు చేస్తున్నారు. ఇది నిరక్షరాస్యులైన కుటుంబాల్లోనే ఎక్కువగా కనిపిస్తోందని వచ్చిన కేసులను అధికారులకు పరిశీలిస్తే తెలుస్తోంది. తమ కులంలో ఆడబిడ్డలకు త్వరగా పెళ్లి చేయడమే సంప్రదాయమని చెబుతూ మైనర్లుగా ఉన్నప్పుడు మనువు కానిచ్చేస్తున్న కుటుంబాలు కూడా ఉన్నాయి.

జిల్లాల వారీగా అధికారులు ఆపిన బాల్య వివాహాల కేసుల వివరాలు..




1098 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వండి..



వివాహ వయసు అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21 సంవత్సరాలుగా ప్రభుత్వం నిర్దేశించింది. చాలావరకు బాల్య వివాహాలు గ్రామీణ ప్రాంతాల్లోనే జరుగుతున్నాయి. వీటిని నిరోధించడానికి 1098 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంది. అధికారులు ఆపిన బాల్యవివాహాల్లో ఎక్కువగా ఈ నంబర్‌కు అందిన ఫిర్యాదుల వల్లే. ఫోన్ చేసిన వారి పేరు, నంబర్ వెల్లడించే అవకాశం లేకపోవడంతో ఎవరైనా నిర్భయంగా సమాచారం అందించవచ్చు. అన్ని విభాగాల సమన్వయంతో బాల్య వివాహాలు ఆపుతున్నారు.

– బి.రాజమణి, వరంగల్ జిల్లా సంక్షేమ అధికారి


వివాహ నమోదు తప్పనిసరి చేయాలి..



జనన, మరణ తేదీల నమోదు మాదిరిగానే వధూవరుల వయసు, పాఠశాల, ఆస్పత్రి రికార్డులను పరిశీలించి మేజర్లైతేనే ముహూర్తం పెట్టేలా బ్రాహ్మణులు చర్యలు తీసుకోవాలి. పెళ్లి నమోదు రికార్డులను సంబంధిత అధికారులకు అప్పగించేలా చూస్తే చాలావరకు బాల్యవివాహాలను కట్టడి చేయవచ్చు. గ్రామాల్లో ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు ప్రతిఒక్కరూ వీటిని నిరోధించేందుకు కృషి చేయాలి. బాల్యవివాహం జరిపితే రెండేళ్ల జైలు శిక్ష లేదా లక్ష రూపాయల వరకు జరిమానా లేదంటే రెండూ ఒకేసారి విధించే వీలుంది. ముఖ్యంగా తల్లిదండ్రుల్లో మార్పుతోనే ఈ వివాహాలు ఆగే అవకాశం ఉంది.

– మండల పరశురాం, సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్, ఉమ్మడి వరంగల్

ఆరోగ్యపరంగా చాలా నష్టం..



పెళ్లి వయస్సు రాకుండా వివాహం చేయడం వల్ల అమ్మాయిలైనా, అబ్బాయిలైనా చాలా కష్టనష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. మానసిక, శారీరక పరిపక్వత లేకపోవడం మూలంగా అనేక సమస్యలు తలెత్తుతాయి. స్వతహాగా ఎదుర్కోలేక మానసికంగా కుంగిపోతారు. చిన్న వయస్సులో బాలికలకు గర్భ సంచి ఎదగదు. ఇలాంటి పరిస్థితుల్లో గర్భం దాలిస్తే గర్భస్రావం జరిగే అవకాశం ఉంటుంది. రక్తహీనతతో సమస్యలు ఎదురవుతాయి. పుట్టిన పిల్లలు కూడా బరువు తక్కువగా ఉంటారు. తరచూ అనారోగ్యం బారిన పడతారు. బాల్యవివాహాలు చేయడం మంచిది కాదు. తల్లిదండ్రులు ఈ విషయంలో పొరపాటు చేయవద్దు.

– డాక్టర్ నరేశ్ కుమార్, రాష్ట్ర వైద్యమండలి సభ్యుడు

క్లుప్తంగా

ఎల్కతుర్తి ఎస్సై రాజ్‌కుమార్‌ సస్పెన్షన్‌



వరంగల్‌ క్రైం: ఎల్కతుర్తి పోలీస్‌స్టేషన్‌ సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ రాజ్‌కుమార్‌ను సస్పెండ్‌ చేస్తూ వరంగల్‌ పోలీస్‌ కమిషనర్‌ అంబర్‌ కిషోర్‌ ఝా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజ్‌కుమార్‌పై పలు రకాల అవినీతి ఆరోపణలు రావడంతో అధికారులు విచారణ చేపట్టారు. దీంతో వాస్తవాలు వెలుగు చూడడంతో సీపీ సస్పెన్షన్‌ వేటు వేశారు.

నేడు ఉమ్మడి వరంగల్‌ జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చ

హన్మకొండ: ఫోరం ఫర్‌ బెటర్‌ వరంగల్‌ ఆధ్వర్యంలో ఈనెల 21న ఉమ్మడి వరంగల్‌ జిల్లా, వరంగల్‌ నగర సమగ్రాభివృద్ధిపై మేధావులచే చర్చా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్‌ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్‌లోని మేధావులు, సమస్యలపై అవగాహన ఉన్న ప్రతినిధులు పాల్గొని తమకు సమాచారమందించాలని కోరారు.

తల్లి మందలించిందని తనయుడి ఆత్మహత్య

కురవి: తల్లి మందలించిందని తనయుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సీరోలు మండల కేంద్రం శివారు రేకులతండాలో శుక్రవారం చోటుచేసుకుంది. తేజావత్‌ చంద్రబాను(22), తల్లి బుల్లితో కలిసి మూడు ఎకరాల వ్యవసాయభూమిని సాగుచేస్తున్నారు. కొడుకును వ్యవసాయ భూమికి వెళ్లమని చెప్పే సమయంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన చంద్రబాను పురుగులమందు తాగడంతో మహబూబాబాద్‌ జనరల్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

వికటించిన నాటు వైద్యం

- మహిళకు అస్వస్థత

నర్సంపేట రూరల్‌: ఇంటింటికీ తిరుగుతూ నాటు వైద్యం మందు గోలీలు అందిస్తూ చికిత్స చేస్తున్న ఓ వైద్యుడు మహిళకు వైద్య చికిత్సకోసం వైబ్రేటింగ్‌ మిషన్‌ అమర్చడంతో బీపీ తగ్గి పడిపోయిన ఘటన వరంగల్‌ జిల్లా నర్సంపేట మండలంలోని నాగుర్లపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన ఆయుర్వేదిక్‌ వైద్యుడు గుమ్మడి రమణ.. ద్విచక్రవాహనంపై సంతానం లేని వారికి మాత్రలు ఇస్తామని, పరీక్షలు చేస్తామని తిరుగుతూ నాగుర్లపల్లికి చెందిన జన్ను సంపూర్ణ ఇంటికి వెళ్లాడు. మొదట వైబ్రేటింగ్‌ మిషన్‌తో ఎల్లయ్యకు పరీక్షలు నిర్వహించగా.. కళ్లు తిరుగుతున్నాయని అన్నాడు. వెంటనే మీరు రూ.5వేలు ఇస్తే మందులు ఇస్తానని కూల్‌డ్రింక్‌(మజా)లో కలుపుకొని తాగాలని సూచించారు. మరో ఐదు వేలు ఇస్తే ఇద్దరికీ మందులు ఇస్తానని చెప్పడంతో సంపూర్ణ తమ వద్ద డబ్బులు లేవని చెప్పింది. కానీ, సదరు వ్యక్తి.. సంపూర్ణకు ఆ వైబ్రేటింగ్‌ మిషన్‌ అమర్చాడు. ఆ వెంటనే బీపీ తగ్గి కిందపడిపోవడంతో భర్త ఎల్లయ్య కేకలు వేశాడు. చుట్టు పక్కవారు వచ్చి సంపూర్ణను స్థానిక వైద్యుడి వద్దకు తరలించి చికిత్స అందించడంతో కోలుకుంది. అనంతరం నాటు వైద్యుడిని నర్సంపేట పోలీస్‌ స్టేషన్‌లో అప్పగించి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై ఎస్సై రవికుమార్‌ను వివరణ కోరగా.. ఫిర్యాదు మేరకు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



నిర్వహణాధికారులు ఎక్కడ?

ఏళ్లు గడుస్తున్నా మేడారంలో ఏర్పాటు కానీ ఈఓ ఆఫీస్‌

- మంత్రులు, ఉన్నతాధికారుల పర్యటనల సమయంలోనే వస్తున్న ఈఓ
- అసహనం వ్యక్తం చేస్తున్న ఆదివాసీ పూజారులు
- వరంగల్‌ ధార్మిక భవనంలో కొనసాగుతున్న కార్యాలయం



వరంగల్‌లోని ధార్మిక భవనం

ఎస్‌ఎస్‌తాడ్వాయి: లక్షలాది మంది భక్తులు వచ్చే సమ్మక్క, సారలమ్మ జాతర, మేడారం అభివృద్ధి విషయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ వైఖరిపై సమ్మక్క, సారలమ్మ పూజారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులంతా హనుమకొండలోనే ఉంటూ మేడారాన్ని పట్టించుకోవడం లేదంటున్నారు. ఇక్కడ జరిగే అభివృద్ధిలో తమ అభిప్రాయాలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మేడారానికి మంత్రులు, జిల్లా కలెక్టర్‌ వస్తేనే అధికారులు మేడారానికి వస్తున్నారని.. ప్రధానంగా కార్యనిర్వహణాధికారి కార్యాలయం మేడారంలో లేకపోవడంతో ఈఓ చుట్టపుచూపుగా ఇక్కడకు వస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

1996లో రాష్ట్ర పండుగగా గుర్తింపు

లక్షలాదిగా భక్తులు తరలివచ్చే మేడారం జాతర 1996లో దేవాదాయశాఖ పరిధిలోకి వెళ్లగా.. ఈ ఏడాది రాష్ట్ర పండుగగా గుర్తించారు. గద్దెల ప్రాంగణం పక్కన ఉన్న రేకుల గదుల్లో ఉంటూ ఈఓ సహా ఇతర సిబ్బంది జాతర సమయంలో సేవలు అందించేవారు. ఇటీవల దాన్ని కూల్చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత మేడారంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలోని కాటేజీల్లో ఈఓ ఆఫీసు ఏర్పాటు చేసి, 2016 జాతర సందర్భంగా ఇక్కడి నుంచి కార్యకలాపాలు నిర్వహించారు. జాతర ముగిసిన తర్వాత మళ్లీ ఈఓ కార్యకలాపాలను హనుమకొండ నుంచే కొనసాగించారు. 2018 జాతర నాటికి అప్పటి సీఎం కేసీఆర్‌ మేడారం అభివృద్ధికి రూ.200 కోట్ల నిధులతోపాటు 200 ఎకరాల స్థలాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖకు అప్పగిస్తామని ప్రకటించారు. కానీ, ఈ రెండు హామీలు అమలుకు నోచుకోలేదు. మరోవైపు తాత్కాలికంగా కొనసాగిన ఈఓ కార్యాలయం కూడా ఇక్కడి నుంచి దూరమైంది. కొన్ని సంవత్సరాలు హనుమకొండలోని అద్దె భవనంలో ఈఓ కార్యాలయాన్ని కొనసాగించారు. అనంతరం వరంగల్‌లో శాశ్వత ధార్మిక భవనం నిర్మించడంతో మేడారం ఈఓ కార్యాలయాన్ని అక్కడకు తరలించారు.

మోకాలడ్డు?

ప్రస్తుతం మేడారం ఈఓగా ఉన్న రాజేంద్రం వరంగల్‌లోని ధార్మిక భవన్‌ కేంద్రంగా విధులు నిర్వర్తిస్తున్నారు. మేడారంలో దేవాదాయ ధర్మాదాయ శాఖకు సంబంధించి అతిథి సముదాయ నిర్మాణానికి రూ.2.15 కోట్లను 2022 జాతర సందర్భంగా మంజూరు చేశారు. ఈ నిర్మాణం పూర్తయితే ఇందులో ఈఓ ఆఫీసు నిర్వహణకు ఆస్కారం ఉండేది. కానీ, మూడేళ్లు గడిచినా నిర్మాణ పనులు మొదలే కాలేదు. మరోవైపు ఇక్కడ మొదలు పెట్టిన రెవెన్యూ, ఆర్‌ అండ్‌ బీ అతిథి, ఆర్‌ డబ్ల్యూఎస్‌ అతిథి గృహాలు పూర్తయ్యాయి. అయితే మేడారంలో ఉంటూ విధులు నిర్వహించడం ఇష్టంలేకనే సంబంధిత అధికారులే పనులు అడ్డుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

ఇన్‌చార్జ్‌ పాలనే..

మేడారం జాతర దేవాదాయశాఖ పరిధిలోకి వచ్చి 30 ఏళ్లు అవుతున్నా.. ఇప్పటికీ మేడారం జాతరకు పూర్తిస్థాయి ఎగ్జిక్యూటివ్‌ ఆఫీసర్‌(ఈఓ)ను నియమించకపోవడం గమనార్హం. ప్రతీసారి జాతర సందర్భంగా ఇతర ఆలయాల్లో సూపరింటెండెంట్‌ హోదా అధికారిని తాత్కాలిక ఈఓగా నియమిస్తున్నారు. ఆ తర్వాత మేడారం జాతరను పట్టించుకోవడం లేదు. కానీ తెలంగాణ వచ్చిన తర్వాత మేడారంలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. రెండేళ్లకోసారి ఇక్కడ భక్తులు కనిపించే దశ నుంచి ప్రతి బుధవారం నుంచి ఆదివారం వరకు సగటున వెయ్యి మంది భక్తులు వచ్చే స్థితికి చేరుకుంది. వందల సంఖ్యలో ప్రైవేట్‌ కాటేజీలు, షాపింగ్‌ కాంప్లెక్స్‌ వెలిశాయి. అయితే వీరిని పట్టించుకునే వారు దేవాదాయశాఖ తరఫున ఇక్కడ ఎవరూ లేకపోవడం గమనార్హం.

ఈఓ ఆఫీస్‌ ఏర్పాటుపై నిర్లక్ష్యం



మేడారంలో ఈఓ ఆఫీస్‌ ఏర్పాటు చేయడంలో దేవాదాయశాఖ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. అధికారుల అవసరాల నిమిత్తం సిటీ వాతావరణానికి అలవాటు పడి మేడారంలో కార్యాలయం ఏర్పాటు చేయడం లేదు. చాలాసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మేడారంలో ఈఓ కార్యాలయం ఏర్పాటుకు కలెక్టర్‌ చర్యలు తీసుకోవాలి.

– సిద్ధబోయిన జగ్గారావు, పూజారుల సంఘం అధ్యక్షుడు

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం

మేడారంలో ఈఓ కార్యాలయం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. భక్తులకు అందుబాటులో ఉండి సేవలందిస్తాం.

– సునీత, అసిస్టెంట్‌ కమిషనర్‌, దేవాదాయశాఖ

నేరాలకు పాల్పడితే చర్యలు

- సెంట్రల్‌జోన్‌ డీసీపీ షేక్‌ సలీమా



కార్డన్‌ సెర్చ్‌లో మాట్లాడుతున్న డీసీపీ సలీమా

వరంగల్‌ క్రైం: నగరంలో నేరాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని నిందితులు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని హనుమకొండ సెంట్రల్‌ జోన్‌ డీసీపీ షేక్‌ సలీమా అన్నారు. శుక్రవారం హనుమకొండ (సుబేదారి) హౌసింగ్‌ బోర్డ్‌ కాలనీలో ఏపీపీ దేవేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు, సైబర్‌ క్రైమ్‌ అధికారులతో కలిసి కార్డన్‌ సెర్చ్‌ నిర్వహించారు. కాలనీల్లో పలు ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రహదారులపై వాహనాలను తనిఖీ చేసి వాహన పత్రాలు లేని వాహనాలను సీజ్‌ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. మైనర్‌ బాలురు వాహనాలు నడపడం, నేరాలు, అసాంఘిక కార్యకలాపాలు డ్రగ్స్‌, గంజాయి ఇతర నేరాలు జరుగుతున్నాయని అన్నారు. సరైన పత్రాలు లేని 20 ద్విచక్రవాహనాలు, 6 ఆటోలు సీజ్‌ చేశామని తెలిపారు. కాలనీలో అనుమానాస్పదంగా ఎవరైన వ్యక్తులు కనిపిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సుబేదారి ఇన్‌స్పెక్టర్‌ సత్యనారాయణరెడ్డి, హనుమకొండ, యూనివర్సిటీ ఇన్‌స్పెక్టర్లు సతీష్‌, రవికుమార్‌, సబ్‌ ఇన్‌స్పెక్టర్లు 10మంది, 100 మంది కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పురుగులమందు డబ్బాతో రైతు ఆందోళన



రైతుతో మాట్లాడుతున్న పోలీసు

కేసముద్రం: బీటీ రోడ్డు నిర్మాణంలో భాగంగా సిమెంట్‌ పైపులతో ఏర్పాటు చేస్తున్న కల్వర్టు వద్ద ఓ రైతు పురుగులమందు డబ్బాతో ఆందోళనకు దిగిన ఘటన మహబూబాబాద్‌ జిల్లా ఇనుగుర్తి మండలంలోని రాముతండా జీపీ శివారు వీరారెడ్డిపల్లి తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరారెడ్డిపల్లి తండా నుంచి రూప్లాతండా వరకు నూతనంగా బీటీ రోడ్డు పనులు చేస్తున్నారు. ఈ మేరకు ఓ చోట కల్వర్టు విస్తరణ పనులు చేపడుతుండగా, ఆ నిర్మాణం వలన తన పంటపొలంలోకి వరదనీరు వచ్చే అవకాశం ఉందంటూ, అదే తండాకు చెందిన ఈర్యా అనే రైతు పురుగుల మందు డబ్బాతో ఆందోళనకు దిగాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, ఆ రైతుకు నచ్చజెప్పి శాంతింపజేశారు.

అరవింద్‌ ఆర్యపకిడేకు 'చేంజ్‌ మేకర్‌' అవార్డు ప్రదానం



అవార్డు ప్రదానం చేస్తున్న సినీ హీరోయిన్‌ రెజినా

హన్మకొండ కల్చరల్‌: చారిత్రక వారసత్వ సంపద పరిరక్షణకు కృషి చేస్తున్నందుకు వరంగల్‌ నగరానికి చెందిన టార్చ్‌ సంస్థ వ్యవస్థాపకులు అరవింద్‌ ఆర్యపకిడే 'చేంజ్‌ మేకర్‌' అవార్డు అందుకున్నారు. రేస్‌ టూ విన్‌ ఫౌండేషన్‌, డెమోక్రటిక్‌ సంఘ్‌ సంయుక్త ఆధ్వర్యంలో సమాజంలో మార్పు కోసం పాటు పడిన వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు, సంస్థలను గుర్తించి శుక్రవారం హైదరాబాద్‌లోని తాజ్‌ఫలక్‌నుమా ప్యాలెస్‌లో చేంజ్‌ మేకర్‌ అవార్డులను ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా ఎంపీ జి.రేణుకాచౌదరి, గౌరవ అతిథులుగా మిస్‌యూనివర్స్‌ 1994 సుస్మితాసేన్‌, హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్‌ జనరల్‌ జెన్నీఫర్‌ లార్సన్‌ పాల్గొన్నారు. ప్రముఖ సంఘ సంస్కర్త, సామాజికవేత్త స్వామి అగ్నివేష్‌కు నివాళులర్పించారు. అనంతరం డెమొక్రటిక్‌ సంఘ్‌ వ్యవస్థాపకురాలు, సినీ హీరోయిన్‌ రెజీనా.. అరవింద్‌ ఆర్యపకిడేకు చేంజ్‌ మేకర్‌ అవార్డు ప్రదానం చేశారు.

డీసీఎం, లారీ డ్రైవర్ల మధ్య లొల్లి



నిరసన తెలుపుతున్న డీసీఎం యజమానులు, డ్రైవర్లు

వరంగల్‌ చౌరస్తా: వరంగల్‌ లోకోషెడ్‌ నుంచి ఫెర్టిలైజర్స్‌ దిగుమతుల విషయంలో కొద్ది నెలలుగా డీసీఎం, లారీ డ్రైవర్ల మధ్య వివాదం నెలకొంది. దీంతో శుక్రవారం డీసీఎం యజమానులు, డ్రైవర్లు వరంగల్‌ పాత అజాంజాహి మిల్లు గ్రౌండ్‌లో నిరసన వ్యక్తం చేశారు. అయితే ఓ రాజకీయ నాయకుడి ప్రమేయం వల్లనే సమస్య జఠిలమై ఓ యూనియన్‌ రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి



సీఎండీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న అసోసియేషన్‌ నాయకులు

- ఎన్పీడీసీఎల్‌ సీఎండీ కర్నాటి వరుణ్‌ రెడ్డి

హన్మకొండ: విద్యుత్‌ ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని టీజీ ఎన్పీడీసీఎల్‌ చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్‌ కార్పొరేట్‌ కార్యాలయంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఆరెపల్లి మోహన్‌ ఆధ్వర్యాన సీఎండీని కలిశారు. ఈ సందర్భంగా సమస్యలను సీఎండీకి వివరించి పరిష్కరించాలని కోరగా.. సానుకూలంగా స్పందించినట్లు అసోసియేషన్‌ ఎన్పీడీసీఎల్‌ కంపెనీ కార్యదర్శి బి.దానయ్య తెలిపారు. కార్యక్రమంలో వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కె.ఉపేందర్‌, ఉపాధ్యక్షుడు రౌతు రమేష్‌కుమార్‌, ఆర్గనైజింగ్‌ కార్యదర్శి తౌర్య తదితరులు పాల్గొన్నారు.

టీజీబీగా ఏపీజీవీబీ బ్రాంచ్‌లు

- 2025 జనవరి 1 నుంచి సేవలు
- బ్యాంకు చైర్మన్‌ కె.ప్రతాప్‌ రెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్‌ కె.ప్రతాప్‌రెడ్డి

హన్మకొండ: రాష్ట్రంలోని ఆంధ్రప్రదేశ్‌ గ్రామీణ వికాస్‌ బ్యాంక్‌ బ్రాంచ్‌లు ఇక నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకులు(టీజీబీ)గా పని చేస్తాయి.. 2025 జనవరి 1 నుంచి పూర్తి స్థాయి సేవలు అందుబాటులో ఉంటాయని ఏపీజీవీబీ చైర్మన్‌ కె.ప్రతాప్‌ రెడ్డి చెప్పారు. శుక్రవారం హనుమకొండలోని బ్యాంకు వరంగల్‌ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలోని 493 ఏపీజీవీబీ బ్రాంచీలు టీజీబీలో విలీనమవుతున్న క్రమంలో ఈనెల 28 నుంచి 31 వరకు బ్యాంకు సేవలు పూర్తిగా నిలిచిపోతాయన్నారు. ఈ నాలుగు రోజుల పాటు సేవల అంతరాయానికి చింతిస్తున్నామని, ఖాతాదారుల నంబర్లు మారవని, చెక్కు బుక్కులు, పాస్‌ బుక్కులు కొత్తవి ఉచితంగానే అందిస్తున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకు సేవల నిలిపివేతపై బ్యాంక్‌ వెబ్‌సైట్‌, వాట్సాప్‌, ఇన్‌స్టాగ్రామ్‌ వంటి సోషల్‌ మీడియాతో పాటు ఖాతాదారులకు ఎస్‌ఎంఎస్‌ రూపంలో సమాచారం చేరవేసినట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఏపీజీవీబీ జనరల్‌ మేనేజర్‌ ఆపరేషన్‌ బి.దయాకర్‌, రీజినల్‌ మేనేజర్‌ జి.పి.ఎస్‌.చైతన్య కుమార్‌, చీఫ్‌ మేనేజర్‌ యశ్వంత్‌, మేనేజర్‌ (ఆపరేషన్‌) కె.వెంకటచారి పాల్గొన్నారు.

దాడి కేసులో నలుగురికి జైలు

- రూ.1,500 చొప్పున జరిమానా

మహబూబాబాద్‌ రూరల్‌: మహిళపై దాడి చేసిన కేసులో నలుగురికి జరిమానాతోపాటు, జైలు శిక్ష విధిస్తూ మహబూబాబాద్‌ అడిషనల్‌ జ్యుడీషియల్‌ ఫస్ట్‌ క్లాస్‌ మేజిస్ట్రేట్‌ తిరుపతి శుక్రవారం తీర్పు నిచ్చారు. కోర్టు డ్యూటీ అధికారి తాజీమ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్‌ జిల్లా సీరోలు మండలం మోదుగులగూడెం గ్రామ శివారు జుజురు తండాకు చెందిన ఇస్లావత్‌ లక్ష్మి తమ పత్తి చేను చుట్టూ కంచె ఏర్పాటు చేసింది. కొందరు వ్యక్తులు కంచెను తొలగించి పశువులను మేపడంతో పంటకు నష్టం వాటిల్లింది. దీంతో కంచెను తొలగించడంపై లక్ష్మి స్థానిక రైతులను అడగగా.. బానోతు కస్న, బానోతు పూల, బానోతు పద్మ, బానోతు కులియ కలిసి అసభ్యకర పదజాలంతో దూషిస్తూ 2020 జూన్‌లో దాడిచేసి గాయపరిచారు. దీంతో లక్ష్మి కుమారుడు ఇస్లావత్‌ రాజేందర్‌ సీరోలు పోలీస్‌ స్టేషన్లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై చంద్రమోహన్‌ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అదే ఏడాది అక్టోబర్‌లో మహబూబాబాద్‌ కోర్టులో చార్జిషీట్‌ దాఖలు చేశారు. పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ జయలత కోర్టులో వాదనలు వినిపించగా ప్రస్తుత సీరోలు ఎస్సై నగేశ్‌ ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ అధికారి తాజీమ్‌ 10 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదనలువిన్న అడిషనల్‌ జుడిషియల్‌ ఫస్ట్‌ క్లాస్‌ మేజిస్ట్రేట్‌ తిరుపతి పై విధంగా తీర్పు వెలువరించారు.

'నిఫ్ట్‌'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



నిఫ్ట్‌ అడ్మిషన్‌ క్యాలెండర్‌ ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు చక్రపాణి, శ్రీనివాస్‌

నయీంనగర్‌ : నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఫ్యాషన్‌ టెక్నాలజీ(నిఫ్ట్‌)–2025 ప్రవేశాలకు ఆన్‌లైన్‌ నిఫ్ట్‌ వెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్‌ ప్రొఫెసర్‌ చక్రపాణి, డాక్టర్‌ ప్రొఫెసర్‌ శ్రీనివాస్‌ తెలిపారు. శుక్రవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో వారు అడ్మిషన్‌ క్యాలెండర్‌ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్‌ నిఫ్ట్‌లో జూలై–2025 గ్రాడ్యుయేట్‌, పోస్ట్‌ గ్రాడ్యుయేట్‌ కోర్సులలో ప్రవేశాలు పొందేందుకు అభ్యర్థులు www.nif-t.ac.in /admirrion లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అండర్‌ గ్రాడ్యుయేట్‌ కోర్సులలో ఫ్యాషన్‌ డిజైన్‌, టెక్స్‌టైల్‌ డిజైన్‌, యాక్సెసరీ డిజైన్‌, నిట్‌వేర్‌ డిజైన్‌, లెథర్‌ డిజైన్‌, ఫ్యాషన్‌ కమ్యూనికేషన్‌, ఫ్యాషన్‌ టెక్నాలజీ–10+2 ఏదైనా స్ట్రీం విద్యార్థులు గ్రాడ్యుయేట్‌, పోస్ట్‌ గ్రాడ్యుయేట్‌ కోర్సులకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 040 23112628, 94412 36043 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో నరేష్‌ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



బన్నీ(ఫైల్‌)

తరిగొప్పుల: హార్వెస్టర్‌ యంత్రం మరమ్మతు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం జనగామ జిల్లా తరిగొప్పుల మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తరిగొప్పులకు చెందిన అనుకేశ్‌ బన్నీ(18) ఇదే గ్రామానికి చెందిన మోటం మొగిళికి చెందిన వరికోత మిషన్‌ మరమ్మతు కోసం వెల్డింగ్‌ మిషన్‌కు విద్యుత్‌ సరఫరా చేసేందుకు విద్యుత్‌ తీగలు సరిచేస్తున్నాడు. ఈక్రమంలో విద్యుత్‌ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా తమకు పరిహారం చెల్లించాలని డిమాండ్‌ చేస్తూ మృతుడి కుటుంబ సభ్యులు మృతదేహంతో మొగిళి ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీదేవి అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించాలని సూచించగా తమకు న్యాయం జరిగేంత వరకు మృతదేహాన్ని తరలించేది లేదన్నారు.

బైక్‌ పైనుంచి పడి వ్యక్తి..



నగేశ్‌ మృతదేహం

కొడకండ్ల: బైక్‌ పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన జనగామ జిల్లా కొడకండ్ల మండలంలోని హక్యాతండా గ్రామ పంచాయతీ పరిధి వెలిశాల శివారులో శుక్రవారం చోటు చేసుకొంది. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు గాంధీనగర్‌కు చెందిన పందుల నగేశ్‌(40) బైక్‌పై కొడకండ్ల వైపు వస్తుండగా అదుపు తప్పి రోడ్డు పక్కన పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెల్సుకున్న ఎస్సై చింత రాజు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో జైలు

కాటారం: మహాముత్తారం మండలం కొర్లకుంటలో 2018లో చోటు చేసుకున్న హత్యాయత్నం కేసులో అదే గ్రామానికి చెందిన నిందితుడు మేడిపల్లి నరేశ్‌కు జైలు శిక్ష విధిస్తూ భూపాలపల్లి జిల్లా కోర్టు అసిస్టెంట్‌ సెషన్స్‌ జడ్జి జయరామిరెడ్డి శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్సై మహేందర్‌కుమార్‌ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం కొర్లకుంటకు చెందిన కాల్వ రాజేశ్‌ అదే గ్రామానికి చెందిన మేడిపల్లి నరేశ్‌పై 2018లో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై రాజు నరేశ్‌పై కేసు నమోదు చేయగా కోర్టులో కొనసాగుతుంది. ఇదే క్రమంలో శుక్రవారం కేసు ట్రయల్‌కు రాగా అడిషనల్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ రఫీ ఆధ్వర్యంలో ఎస్సై మహేందర్‌కుమార్‌, కోర్టు లైజనింగ్‌ ఆఫీసర్‌ వెంకన్న, కోర్టు పీసీ సంపత్‌రెడ్డి సాక్షులను కోర్టు ఎదుట ప్రవేశపెట్టారు. దీంతో నేర నిరూపణ కావడంతో జడ్జి.. నిందితుడు నరేశ్‌కు రెండేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమాన విధిస్తూ తీర్పు వెల్లడించారు. ట్రయల్‌ను విజయవంతం చేసిన ఎస్సై, సిబ్బందిని కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు అభినందించారు.

భర్త చేతిలో భార్య హతం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మడికొండ: కట్టుకున్న భర్తే కాలయముడై ఉరి వేసి చంపిన ఘటన కాజీపేట మండలం అమ్మవారిపేట గ్రామంలో చోటు చేసుకుంది. మడికొండ ఇన్‌స్పెక్టర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం అమ్మవారిపేట గ్రామానికి చెందిన మైదం కొంరయ్య కొద్ది రోజులుగా పని చేయకపోగా తాగుడుకు బానిసై భార్య మైదం సంతోష(55), కుమారుడు రాజేశ్‌తో గొడవ పడుతూ చంపుతానని బెదించేవాడు. ఈక్రమంలో గ్రామంలో కుల పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. పంచాయితీలో పెద్దమనుషులు కుటుంబ సభ్యులు, కొంరయ్యను మందలించి పంపించారు. ఈక్రమంలో గురువారం ఇంట్లో ఉన్న సంతోషతో గొడవ పడి తాడుతో గొంతుకు బిగించి హత్య చేశాడు. కోడలు చూసి కేకలు వేయడంతో కొంరయ్య పారిపోయాడు. శుక్రవారం కుమారుడు రాజేశ్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్‌ కిషన్‌ తెలిపారు.

డబ్బులు ఇవ్వాల్సి వస్తుందని హత్య?

- కాటారం మండలం అంకుషాపూర్‌లో ఘటన
- వివాహేతర సంబంధమే కారణం..?



శైలజ మృతదేహం

కాటారం: భర్తతో విడిపోయి ఉంటున్న మహిళతో వివాహేతర సంబంధం నెరపుతున్నాడు ఓ వ్యక్తి.. ఆ తర్వాత ఇద్దరి మధ్య గొడవలు జరగడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ చేసుకొని రూ.40 వేలు ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. కానీ, పైసలు ఇవ్వకుండా ఉండేందుకు ఆ మహిళను హత్య చేశాడు ఆ వ్యక్తి. జయశంకర్‌భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి, పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మండలం కమలాపూర్‌కు చెందిన కాల్వ శైలజ(30) అనే మహిళ.. భర్తతో విడిపోయి ఐదేళ్లుగా తల్లిగారి ఇంటి వద్ద ఉంటుంది. తన అక్క, చెల్లి అత్తగారి గ్రామమైన కాటారం మండలంలోని అంకుషాపూర్‌కు అప్పుడప్పుడు వచ్చి వెళ్తుంది. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన ఇనుగాల రమేశ్‌తో పరిచయం ఏర్పడి అది కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఇది రమేశ్‌ భార్యకు తెలియడంతో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరిగాయి. దీంతో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ జరగగా రమేశ్‌, శైలజకు రూ.40 వేలు ఇవ్వాలని నిర్ణయించారు. కానీ ఒప్పుకున్న విధంగా రమేశ్‌, శైలజకు డబ్బులు ఇవ్వకపోగా ఇంటికి వచ్చి బెదిరింపులకు గురి చేయడంతో భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో రమేశ్‌ ఈ నెల 17న శైలజ ఇంటికి వచ్చి రాజీ పడాలని బ్రతిమిలాడటంతో ఆమె ఒప్పుకుంది. అనంతరం రమేశ్‌ వెళ్లిపోగా శైలజ సైతం భూపాలపల్లికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసినవారి వద్ద ఆరా తీసి చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, అంకుషాపూర్‌ శివారులోని అటవీప్రాంతంలో శుక్రవారం ఓ మహిళ మృతదేహం కన్పించడంతో శైలజ అని గుర్తించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. మూడు రోజుల క్రితం గొంతు నులిమి హత్య చేసినట్లు ఆనవాళ్లు గుర్తించారు. సంఘటనా స్థలాన్ని కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్‌, క్లూస్‌ టీం ఎస్సై రాజ్‌కుమార్‌ పరిశీలించారు. హత్య స్థలంలో పలు వివరాలు సేకరించారు. రూ.40 వేలు ఇవ్వాల్సి వస్తుందని రమేశ్‌ తన కూతురికి మాయమాటలు చెప్పి అడవిలోకి తీసుకొచ్చి హత్య చేశాడని శైలజ తల్లి దుర్గమ్మ పేర్కొంది. దుర్గమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమేశ్‌పై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్సై తెలిపారు.

24న అంపశయ్య నవీన్‌ గ్రంథాల ఆవిష్కరణ

విద్యారణ్యపురి: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్‌ జన్మదినం సందర్భంగా నవీన్‌ లిటరరీ ట్రస్టు ఆధ్వర్యాన ఈనెల 24న సాయంత్రం 5.30 గంటలకు హనుమకొండ వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో అంపశయ్య నవీన్‌ గ్రంథాలను ఆవిష్కరించనున్నారు. అలాగే ప్రథమ నవలా పురస్కారాలు కూడా అందజేయనున్నట్లు అంపశయ్య నవీన్‌ ట్రస్టు సెక్రటరీ డి.స్వప్న శుక్రవారం తెలిపారు. 'ప్రేమకు ఆవలి తీరం' నవలకు ఇంగ్లిష్‌ అనువాదం(బియాండ్‌ ది షోర్‌ఆఫ్‌ లవ్‌) గ్రంథాన్ని ప్రొఫెసర్‌ మిట్టపెల్లి రాజేశ్వర్‌, కర్రె సదాశివ్‌ రచించిన అంపశయ్యనవీన్‌ కథలు–ఒక పరిశీలన గ్రంథాన్ని జి.గిరిజామనోహర్‌బాబు ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.